క్లుప్తంగా

వైఎస్ఆర్ సీపీ నేత మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: మండలంలోని నాగరాజుకుప్పం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు ఎం.రామచంద్రారెడ్డి శుక్రవారం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. నాగరాజుకుప్పం గ్రామానికి వెళ్లిన మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పూలదండను రామచంద్రారెడ్డి మృతదేహంపై ఉంచి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్ఆర్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు బరువు, ఎత్తు, హెచ్‌బీ పరీక్షిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: విద్యార్థులు బరువు, ఎత్తు, హెచ్‌బీలను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్ క్రిష్ణ తెలిపారు. శుక్రవారం స్థాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపల్ హేమలత సమక్షంలో విద్యార్థులకు బరువు, ఎత్తు, హెచ్‌బీ వైద్య పరీక్షలు చేశారు. ప్రిన్సిపల్ హేమలత మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యాన్ని కూడా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. హెచ్‌బీ తక్కువగా ఉన్న విద్యార్థులు ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎం రాణి, ఆశా, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



పారిశుధ్య కార్మికులతో ప్లాస్టిక్ కవర్లను తీయిస్తున్న ఎంపీడీఓ సతీష్, సర్పంచ్ మహేష్ బాబు

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఉండాలంటే తడి–పొడి చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీఓ సతీష్ తెలిపారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో చెత్త సేకరిస్తున్న వాహనాన్ని సర్పంచ్ గాలి మహేష్‌బాబు, ఎంపీడీఓ సతీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు. అనంతరం ఎస్‌కేఆర్ పురం సమీపంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ఆయన వెంట సత్యనారాయణ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆకుకూరల సాగు



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

గంగాధరనెల్లూరు: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు వస్తాయని, దీంతోపాటు ఆకుకూరలు సాగు చేస్తే రెట్టింపు లాభాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి నాంచారమ్మ అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని వేల్కూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు రాజేశ్వరి వ్యవసాయ భూమిలో ఏటీఎం నమూనా వేసి, ఈ నమూనాలో భాగంగా గడ్డి జాతి, తీగజాతి ఆకుకూరల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగలు ఏ గ్రేడ్‌లో లైన్ పద్ధతిలో కంది, అలసంద, అనప, మినుము, పెసలు పెంచు కోవడంతో లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు ప్రతాప్, ధనలక్ష్మి, మునీర, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

నగరి: స్థానిక ఫ్రిడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని దివ్యాంగులకు ప్రేరణశ్రీ ఎడ్యుకేషనల్, ఛారిటబుల్ ట్రస్టు వారు అన్నదానం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలకు చేరుకున్న వారు అందరికీ విందు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో పుష్యంత్, ట్రస్టు ఫౌండర్లు టి.మోహనలక్ష్మి, ఇ.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బాబు మోసాలు తీసుకెళ్దాం

- నమ్మిన ప్రజలు ఎంత మోసపోయారో తెలియజేద్దాం
- కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధిచెబుతారు
- మాజీ మంత్రి ఆర్కే రోజా
- నింద్ర, విజయపురంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం



నింద్ర సభలో క్యూఆర్ కోడ్ చూపుతున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా, నాయకులు



వడమాలపేట నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నింద్ర/విజయపురం: గడప గడపకు చంద్రబాబు మోసాలు తీసుకెళ్దామని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం నింద్ర మండలం మిట్టకండ్రిగ గ్రామం, విజయపురం మండలంలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు మేనిఫెస్టోను సవివరంగా చూడవచ్చని, అది ఎలా చూడాలో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం ఏమార్చిందన్నారు. ఆశపడి ఓటేసిన ప్రజలు నేడు మోసాన్ని గ్రహించి బాధపడుతున్నారన్నారు. గతంలో తొలిసారి ముఖ్యమంత్రి అయిన జగనన్న ఇచ్చిన ప్రతి హామీ కుల, మత, పార్టీలకు అతీతంగా నెరవేర్చారన్నారు. ఓట్లు గడించడానికికే వారు మేనిఫెస్టో సిద్ధం చేశారన్నారు. అది నేడు ప్రజలకు అర్థమవుతోందన్నారు. ప్రభుత్వం చేసిన మోసాలు గడప గడపకు వెళ్లి వివరించి మళ్లీ వారు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఉచితంగా బస్సులో తిరిగవచ్చని శ్రీశైలం వెళ్లి మల్లికార్జున స్వామిని చూడొచ్చు, విజయవాడకు వెళ్లి కనకదుర్గమ్మను చూడొచ్చు, సింహాద్రి అప్పన్నను, భద్రాచలం రామయ్యను ఇలా అన్ని చోట్లకు వెళ్లవచ్చంటూ మహిళలను ఆశల పల్లకి ఎక్కించారన్నారు. ఉచితంగా బస్సులో తిరుగుతున్నారా అంటూ ప్రశ్నించారు. ప్రజల తరపున ప్రశ్నిస్తానన్న పవన్... వెన్నుపోటు పొడుస్తూనే ఉండండి నేను సపోర్ట్ చేస్తూనే ఉంటా అంటూ చంద్రబాబుకు భరోసా ఇస్తున్నారన్నారు. నింద్రలో ఉన్న కొందరు నాయకులు తనపై అసత్య ప్రేలాపనలు చేస్తున్నారని, వారి చరిత్ర ప్రజలందరికీ తెలుసన్నారు. నింద్రలో సొంత చిన్నాన్నకే వెన్నుపోటు పొడిచిన వారు, వైఎస్ఆర్ సీపీలో రాష్ట్రస్థాయి పదవులు అనుభవించి, పార్టీకి, తనకు వెన్నుపోటు పొడిచారన్నారు. నేడు టీడీపీలో ఉంటూ అక్కడ ఎవరికి వెన్నుపోటు పొడవాలో ఆలోచిస్తున్నారన్నారు. నింద్రలో రూ.1.70 కోట్ల వ్యయంతో వెంకటేశ్వర స్వామిఆలయం తాను మంత్రిగా ఉన్నప్పుడే నిర్మించానన్నారు. బుగ్గ దేవాలయం వద్ద టీటీడీ కళ్యాణ మండపం మంజూరు చేయించామన్నారు. భూ సమస్యలు పరిష్కరించి, ఇంటి పట్టాలు ఇచ్చామన్నారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, జడ్పీటీసీ పరంధామ, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్, మహిళా విభాగం కార్యదర్శి మేరీ, మండల కన్వీనర్ వేణురాజు, జిల్లా పార్టీ కార్యదర్శి అనిల్, రైతు విభాగం కార్యదర్శి తోయజాక్షరెడ్డి, నాయకులు దామోదరం, శివయ్య, మునికృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, గోవిందమ్మ, చెంచమ్మ, గోపి, బాబురెడ్డి, చంద్రబాబు, విజేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌నాయుడు, శేఖర్‌రాజు, కన్వీనర్ శివరాజు, వైస్ ఎంపీపీ బాలాజీ, నార్పరాజు, సురేష్, గోపి, బాలక్ష్మణనాయుడు, సుధాకర్, భాస్కర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, అంబిక, జిల్లు, సుబ్రమణ్యం, కిషోర్‌రెడ్డి, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



విజయపురంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



సమావేశానికి హాజరైన జనం

సమస్యలు, సవాళ్లను అధిగమిద్దాం

నగరి: కూటమి పాలనలో వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎదురవుతున్న సమస్యలను, సవాళ్లను అధిగమిద్దామని, పార్టీని బలోపేతం చేద్దామని మాజీ మంత్రి ఆర్కే రోజా వడమాలపేట మండల శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వడమాలపేట మండల పార్టీ శ్రేణులతో నగరి పట్టణంలోని తన నివాస కార్యాలయంలో ఆమె సమావేశమయ్యారు. స్థానికంగా పార్టీ శ్రేణులకు ఎదురవుతున్న సమస్యలపై ఆమె చర్చించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత కార్యక్రమాలను ఎండగడుతూ, గత పాలనలో సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు స్పష్టంగా చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం హామీల మాయలో ప్రజలను మోసం చేసిందన్నారు. వాటిని ప్రశ్నిస్తున్న వైఎస్ఆర్ సీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. మానవీయ విలువలను మరిచిన ప్రస్తుత రాజకీయ ధోరణిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిఒక్కరూ జగనన్న ఆశయాలను ప్రజల్లోకి చేరవేసే విధంగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో వడమాలపేట మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, స్టేట్, జిల్లా, మండల నాయకులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



విద్యార్థులతో ప్రిన్సిపల్, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

నగరి: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని పేద విద్యార్థులకు నగరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందజేశారు. శుక్రవారం కళాశాలకు విచ్చేసిన లయన్స్ క్లబ్ నిర్వాహకులు ప్రిన్సిపల్ ఎ.మంజుల సమక్షంలో 12 మంది విద్యార్థులకు రూ.3000 చొప్పున రూ.36 వేలు ఉపకార వేతనంగా అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ హెచ్.ప్రభాకర్ రాజు మాట్లాడుతూ పేదరికం చదువుకి అడ్డు కాదని, పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత స్థాయికి చేరవచ్చునన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులని ఆర్థికంగా ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గజేంద్ర, కార్యదర్శి ఎ.మోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రాధాకృష్ణ, కోశాధికారి శక్తివేల్, సభ్యులు దేవన్, కిషోర్ కుమార్, బాబు, షఫీ, ఎన్ఎస్ఎస్ అధికారి బ్రహ్మానందం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్ర ప్రదాయినికి ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి మొక్కుకుంటున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



మాజీ మంత్రికి ప్రసాదాలు అందిస్తున్న ఆలయ అర్చకులు

– భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టిన మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి: పట్టణంలోని నేత్రప్రదాయిని క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకొని మాజీ మంత్రి ఆర్కే రోజా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలుకగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేయించుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థం, కుంకుమ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి కరుణా కటాక్షాలతో ఆలయాన్ని ఇంత పెద్ద ఎత్తున నిర్మించే అవకాశం తనకు కలిగిందన్నారు. అది అమ్మవారు తనకిచ్చిన భాగ్యమన్నారు. ఆమె చల్లని వీక్షణాలు ప్రజలపై ఎప్పుడూ ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. శ్రావణమాస శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకం కావడంతో పొంగళ్లు పెట్టి ప్రార్థించుకున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు వేణుబాబు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, తిరుమలరెడ్డి, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మురుగయ్య, యాకోబు, కో–ఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, ఎన్‌సీ ఆనంద్‌కుమార్, నాయకులు వెంకటేష్, క్రిష్ణమూర్తి, తేన్‌మొళి, దామునాయుడు, హరి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో కలపండి

వెదురుకుప్పం: మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని బీజేపీ నాయకులు శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. మండల ప్రజలకు తిరుపతి అందుబాటులో ఉందని, విద్యా, వైద్య పరంగా రైతులు వ్యాపార నిమిత్తం నిత్యం తిరుపతికి వెళ్తుంటారని చెప్పారు. ప్రజల ఆకాంక్ష మేరకు తిరుపతి జిల్లాలో కలిపేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చెంగారెడ్డి కోరారు.

సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా

– నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్

పాలసముద్రం: పాలసముద్రం మండలం తమిళనాడు రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నందున రాత్రి సమయంలో ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాపై పోలీస్ సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలని నగరి డివిజన్ డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ మాట్లాడుతూ పోలీసులు గ్రామాల్లో పర్యటించి చిన్నచిన్న గొడవలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు సిబ్బంది గ్రామాల్లో పర్యటించి గొడవలు రాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. మండలంలో చట్టానికి విరుదంగా ఎలాంటి కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రికార్డులు తరవుగా పరిశీలించారు. కార్యక్రమంలో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ చిన్నరెడ్డప్ప పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి కోసం ప్రత్యేక ప్రార్థనలు



వేలాంగనిలో మోకాళ్లపై వెళ్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

పాలసముద్రం: వైఎస్ఆర్ సీపీ నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని లిక్కర్ స్కాం పేరుతో అక్రమంగా అరెస్టు చేశారని, ఆయన త్వరగా బయటకు రావాలని తమిళనాడు రాష్ట్రం వేలాంగని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశామని మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. శుక్రవారం తమ పార్టీ కార్యకర్తలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేసినట్టు తెలిపారు. వైఎస్ఆర్ సీపీ జెండాతో కిలో మీటర్ల దూరం ఇసుకలో మోకాళ్లపై నడిచినట్లు పేర్కొన్నారు. తులసి యాదవ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఏదో రకంగా ఇబ్బంది పెట్టాలని చూడడం కూటమి సర్కార్‌కు సమంజనం కాదన్నారు. వైఎస్ఆర్ సీపీ హయాంలో ప్రభుత్వ లిక్కర్ దుకాణాల ద్వారా ప్రభుత్వానికి విపరీతంగా ఆదాయం చేకూరిందన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తున్న కూటమి ప్రభుత్వంలో అదే బ్రాండ్‌లు ఆరు నెలలపాటు కొనసాగించారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పప్రకాష్, సర్పంచులు అయ్యప్ప, లిల్లీఆనంద్, అనురేఖ మదివానన్, యూత్ లీడర్ ఆనంద్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం



ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశం

నగరి: ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, పోలింగ్ స్టేషన్ల పెంపు తదితర అంశాలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం తహసీల్దార్ రవికుమార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన చర్చించారు. ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధ చేస్తామన్నారు. 1150 ఓటర్ల కంటే ఎక్కువగా ఉంటే విడిగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజవర్గంలో ప్రస్తుతం 226 పోలింగ్ స్టేషన్లు ఉండగా ప్రస్తుతం ఓటర్ల ప్రాతిపదికన 29 స్టేషన్లు పెరిగాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ పార్టీల నాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా జీతాల్లేవు

- యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నగరి: ఉపాధ్యాయ బదిలీలు చేపట్టి రెండు నెలలు పూర్తి కావస్తున్నా ఇంకా జీతాలు చెల్లించకపోవడంపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలు చేపట్టి రెండు నెలలు పూర్తి కావస్తున్నా పొజిషన్ ఐడీల కోసం క్యాడర్ స్ట్రెంత్ ఫైల్ ఇంత వరకు ఆమోదం పొందలేదన్నారు. కేబినెట్ సమావేశంలో చర్చ జరిపి ఆమోదిస్తామని చెప్పి వాటి ప్రస్తావనే చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆమోదం ద్వారా పరిష్కరిస్తామని ఉన్నతాధికారులు తెలుపుతున్నా ఇంత వరకు ముఖ్యమంత్రికి ఈ ఫైల్ చేరలేదన్నారు. జీతాల చెల్లింపునకు ఇంకా ఆలస్యమయ్యే పరిస్థితి కనబడుతోందన్నారు. మరో వైపు బోధనేతర కార్యక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. విద్యాశాఖ వైఖరిని నిరశిస్తూ శనివారం సాయంత్రం డీఈఓ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర సంఘం నిర్ణయించిందన్నారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మునిరత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, జనార్ధన్, ప్రకాష్, రవిబాబు, వంశీకృష్ణ, మోహన్, కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో జీవించాలి



విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



పాల్గొన్న విద్యార్థులు

పెనుమూరు(కార్వేటినగరం): ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో, ధైర్యంగా జీవించాలని ప్రముఖ కవి అభయ ఫౌండేషన్ సేవా కార్యకర్త పసుపుల హరికృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటేశ్వ విద్యానికేతన్ పాఠశాలలో అభయా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభయ భవిత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో నేటి సమాజంలో ఆడపిల్లలు అనేక లైగింక వేధింపులకు, దాడులకు గురువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుష్టశక్తుల నుంచి ఆడపిల్లలు తమను తాము రక్షించుకోవాలని సూచించారు. విద్యార్థులతో ఆత్మరక్షణ పద్ధతులను ప్రదర్శింప చేశారు. అనంతరం అభయ భవిత కార్యక్రమ ప్రతిజ్ఞ, యోగా విన్యాసాలు చేయించారు. అలాగే అభయ భవిత పోస్టర్లను ఆవిష్కరించి, విద్యార్థులకు పంచిపెట్టారు. అనంతరం పాఠశాల హెచ్ఎం గీతాంజలి మాట్లాడుతూ ఆత్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచందర్ స్వామీజీకి, ప్రముఖ కవి హరికృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర విద్యానికేతన్ అధినేత కేశవ చౌదరి, ఉపాధ్యాయులు నారాయణ, గిరి, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

అడుగు పెడితే.. ఒళ్లు గుల్ల



కంకర తేలి అధ్వాన్నంగా ఉన్న అగ్గిచేనుపల్లె రోడ్డు

వెదురుకుప్పం: గ్రామీణ రోడ్లు రూపురేఖలు మారిపోతున్నాయి. ఆనవాళ్లు కోల్పోయిన గ్రామీణ రహదారులపై నడక నరకప్రాయంగా మారుతోంది. ప్రయాణికుల అవస్థలను పట్టించుకోవాల్సిన పాలకులు అటుగా ఆసక్తి చూపకపోవడంతో ప్రజలు సమస్యలతో సహజీవనం చేయాల్సి వస్తోంది. మండలంలోని కొత్తపల్లెమిట్ట–దేవళంపేట రోడ్డు నుంచి వావిల్‌చేను, అగ్గిచేనుపల్లె మీదుగా పెనుమూరు ప్రధాన రహదారి వరకు ఉన్న తారు రోడ్డు ప్రస్తుతం దుస్థితికి చేరింది. ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడి ఛిద్రమైపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లు తేలి అధ్వానంగా తయారవడంతో రోడ్డుపై రాకపోకలు సాగించలేకున్నామని స్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. అడుగు పెట్టాలంటే ఒళ్లు గుల్లవుతున్నట్లు వాపోతున్నారు.

వర్షం వస్తే రోడ్డు అక్కడక్కడా గోతులు ఏర్పడి వర్షపు నీటితో చిన్నపాటి కుంటలను తలపిస్తోందని స్థానికులు అంటున్నారు. ఈ మార్గంలో వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. కంకర తేలి ఆనవాళ్లు కోల్పోవడంతో నరకయాతన పడుతున్నట్లు చెప్పున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.